# జయదేవకృత 'గీతగోవింద' మహా కావ్యం : అష్టపదులలో శృంగార రసం మరియు దశ కామావస్థలు

**నాగలాపురం హరిప్రియ**, అకెడమిక్ కన్సల్టెంట్ (డాన్స్), సంగీత, నృత్య, లలిత కళల విభాగము, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి. ఆంధ్రప్రదేశ్

వ్యాస సంగ్రహము:

భారతీయ సాహిత్యానికి, భక్తి పరంపరకు, సంస్కృతి - కళలకు ఆలవాలంగా నిలిచిన 'గీతగోవిందం' కావ్యాన్ని 12వ శతాబ్దానికి చెందిన శ్రీ జయదేవులు రచించారు. ఈ సంస్కృత మహాకావ్యం సంప్రదాయబద్ధమైన వైష్ణవ భక్తికి కొత్త స్వరూపాన్నిచ్చింది. పరమాత్మలో జీవాత్మ ఐక్యమవ్వదానికి పడే తపనను శృంగార రస మాధ్యమంగా జయదేవులు వర్ణించిన తీరు వర్ణనాతీతం. భారతీయ కళల్లో శ్రీ కృష్ణుని లీలల ప్రస్తావన దాదాపుగా అన్నింటిలోనూ గమనించగలం. ముఖ్యంగా శ్రీ కృష్ణుని ప్రస్తావన లేని ఏ శాస్త్రీయ నృత్య కళారూపం ఉండదేమో! అనడంలో ఎలాంటి సందేహం లేదు. శ్రీ జయదేవులు రాసిన 'గీతగోవిందం' కావ్యం శృంగార రస ప్రధాన కావ్యాలకే మేరు పర్వతం వంటిదని చెప్పొచ్చు. రాధాకృష్ణుల రాసలీలలు, విరహ వేదనలను భక్తుల హృదయాలకు హత్తుకునే రీతిలో జయదేవులు రచించిన 'అష్టపదులు' అమోఘం! జయదేవుని అష్టపదులలో మనోధర్మానికి, రసాభినయానికి ఉన్న పరిధి చాలా ఎక్కువ. కనుకే, భరతనాట్యం, ఒడిస్సీ, కూచిపూడి, కథాకళి, మోహినియాట్టం, సత్త్రియా, మణిపురి, కథక్ మొదలగు అన్ని శాస్త్రీయ నృత్య మార్గాలలో 'అష్టపదులు' ముఖ్య భాగమైనాయి. నాట్యంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన అష్టపదులను, వాటిలోని భావార్థాలను మరియు రస వైవిధ్యాలను విశ్లేషించడమే ఈ పరిశోధనావ్యాస ముఖ్యోద్దేశం. ఈ అధ్యయనం కోసం జయదేవుల 'గీతగోవిందం'పై ప్రచురితమైన గ్రంథాలతో పాటు, భారతీయ శాస్త్రీయ నృత్య పరంపరలోని దిగ్గజుల ప్రదర్శనలు, IGNCA & దూరదర్శన్ ఆర్కైవులు, అంతర్జాతీయంగా జరిగిన లెక్చర్ డిమాన్స్ట్రేషన్లు మొదలైనవి ఆధారాలుగా చేసోకవడం జరిగింది. అంతేకాక, నాట్య ప్రదర్శనల్లో కళాకారుల సృజనశీలత మరియు అభిరుచులకు అనుగుణంగా నృత్యకల్పనల్లో ఆశువుగా చేయబడే మార్పులుండటం కారణంగా, ప్రతీ అష్టపదికి ఒకటి కంటే ఎక్కువ శాస్త్రీయ నృత్యాల ప్రదర్శనలను మరియు సాహిత్య వివరణలను ఆధారంగా చేసోకవడం జరిగింది. గీతగోవింద కావ్యంలో 24 అష్టపదులున్నప్పటికీ, అధ్యయనం కోసం పరిమిత సంఖ్యలో కొన్ని అష్టపదులను ఎంపిక చేసోకనబడింది. ఈ పరిశోధనాపత్రం వివరణాత్మకమైంది.

key words: శృంగార రసం, సంభోగ శృంగారం, విప్రలంభ శృంగారం, రతి, శోకం, విరహం, కామావస్థలు.

**<u>ఉపోద్ఘాతం - శ్రీ జయదేవుల పరిచయం:</u>**

శ్రీ జయదేవుని జననం ఉత్కళ రాష్ట్రంలోని 'కెందు బిల్వం' అనే గ్రామంలో 12 వ శతాబ్దంలో జరిగింది. ఇది ప్రస్తుత ఒడిస్సా – బెంగాల్ ప్రాంతముగా అనుకోవచ్చు. వీరి తల్లిదండ్రులు రమాదేవి- భోజదేవులు. రమాదేవి శ్రీ జగన్నాథునికి పరమ భక్తురాలు. ఈ దంపతులు మహావిష్ణువుని సత్సంతానం కోసం ప్రార్థించగా, ఆ వ్యాస మహర్షే రమాదేవి గర్భంలోకి ప్రవేశ పెట్టినట్టు భోజదేవునికి కలలో చెప్పి మహావిష్ణువు అంతర్ధానమయ్యెనని ప్రతీతి. పుట్టిన బాలునికి వారు 'జయదేవుడు' అని పేరు పెట్టారు. జయదేవుడు చిన్నతనం నుంచే జగన్నాథునిపై ఎంతో భక్తిని పెంచుకున్నాడు. యుక్త వయస్సుకొచ్చే సరికి సకల వేద సారాన్ని తెల్సుకొని గొప్ప పండితునిగా ఎదిగాడు. ఇతని పాండిత్యానికి, సంగీత సాహిత్యాలపై ఉన్న పట్టును మెచ్చి వంగ దేశపు రాజు జయదేవున్ని ఆస్థాన కవిగా నియమించెను. ఇతడి వివాహము 'పద్మావతి' అను కన్యతో జరిపించారు. వివాహానంతరం కొన్నాళ్ళకు, రాగ తాళయుక్తంగా 'గీతగోవిందం'ను రచించి రసికుల మన్ననలను పొందెను.

19వ అష్టపదిని రాసేటప్పుడు శ్రీకృష్ణుడు రాధ పాదాలను తన తలపై పెట్టుకున్నట్టు జయదేవుడు కావ్యంలో రాయదలిచినాడు. కానీ, ఇది విపరీత ధోరణిగా స్వామి భావిస్తారేమో, సమాజం స్వీకరించదేమో అనే సంధిగ్దంలో పడి రాయలేకపోయాడు. ఇతను నదీ స్నానానికి పోయి తిరిగి వచ్చే సరికి ఆ అష్టపదిని స్వయంగా జగన్నాథుడే వచ్చి పూరించి వెళ్ళాడు అని తెలిసి ఆశ్చర్యపోయాడట. అప్పటినుంచి రాజ్యంలో గీతగోవిందానికి ఆదరణ విపరీతంగా పెరిగిపోయింది. ఆనాటి నుంచి పూరి జగన్నాథుని ఆలయంలో దేవదాసీలు చేసే ఒడిస్సీ ఆలయ నృత్యంలో 'అష్టపదులు' భాగమైనాయి. ఆ సాంప్రదాయం తరువాత కాలంలో కేరళకు విస్తరించింది. కేరళ రాజ్యంలో మొదట 'కృష్ణాట్టం'గా ప్రసిద్ధి చెందింది. పిమ్మట కథాకళి, మోహినీయాట్టంలోని నృత్య మార్గాలలో భాగమైంది. అలాగే సదిర్ ఆట్టం (భరతనాట్యంకు పూర్వ రూపం), దాసీఆట్టం (చోళ రాజ్యంలోని దేవదాసీలు చేసే నృత్యం), కూచిపూడి మార్గాల్లో కూడా 'గీతగోవిందం'లోని 'అష్టపదులు' ప్రాముఖ్యతను సంతరించుకుంది. అలా దేశమంతటా అన్ని శాస్త్రీయ నృత్యాల్లో నేడు మనం ఈ అష్టపదుల ప్రదర్శనను చూడగలుగుతున్నాం.

**గీతగోవిందం**

శ్రీ మహా విష్ణువు ద్వాపర యుగంలో కృష్ణావతారమున చేసిన లీలలను గూర్చి, రాధామాధవుల మధ్య జరిగే ప్రణయ కేళీలు, విరహ కలహాను గూర్చి రసరంజితంగా వర్ణిస్తూ జయదేవులు సంస్కృతంలో రాసిన గీతగోవిందకావ్యంలో మొత్తం 12 సర్గలున్నాయి. ఒక్కో సర్గ పలు ప్రభంధాలుగా విభజించబడింది. ఒక్కో ప్రభంధం పలు అష్టపదాలుగా విభజించబడ్డాయి. ఇందులో మొత్తం 24 అష్టపదులున్నాయి. అవి:

- అష్టపది 1 - దశావతార కీర్తి ధవళం
- అష్టపది 2 - హరి విజయ మంగళాచరణం
- అష్టపది 3 – మాధవోత్సవ కమలాకరం
- అష్టపది 4 – సామోద దామోదర భ్రమరపదం
- అష్టపది 5 – మధురిపు రత్నకంఠిత
- అష్టపది 6 – ఆక్లేశ కేశవ మంజరీ తిలకం
- అష్టపది 7 – ముగ్ధ మధుసూదన హంసక్రీడం
- అష్టపది 8 – హరివల్లభ శోకపల్లవం
- అష్టపది 9 – స్నిగ్ధ ముగ్ధ మధుసూధన రసావలయం
- అష్టపది 10 – హరి సముదయ గరుడపదం
- అష్టపది 11 – సాకాంక్ష పుండరీకాక్షోత్కంఠామధురం
- అష్టపది 12 – ధన్య (దృష్ట) వైకుంఠ కుంకుమం
- అష్టపది 13 – నాగర నారాయణ రాసా వలయం
- అష్టపది 14 – హరిరమిత చంపక శేఖరం
- అష్టపది 15 – హరిరస మన్మధ తిలకం
- అష్టపది 16 – నారాయణ మదనాయాసం
- అష్టపది 17 –లక్ష్మీపతి రత్నావళి

- అష్టపది 18 – ఆమంద ముకుందం
- అష్టపది 19 – చతుర చతుర్భుజ రాగరంజిత చంద్రోదయం
- అష్టపది 2ం – శ్రీ హరి తాలరాజ జలధర విలసితం
- అష్టపది 21 – సానంద దామోదర ప్రేమద్రుమ పల్లవం
- అష్టపది 22 – సానంద దామోదర రాగాశ్రేణి కుసుమాభరణం
- అష్టపది 23 – మధురిపు విద్యాధర లీలం
- అష్టపది 24 – సుప్రీత పీతాంభర తాళశ్రేణి

ప్రతీ ప్రభంధంలో ఎనిమిది శ్లోకాలు /చరణాలుంటాయి. కాబట్టి దీన్ని 'అష్టపదులు' అంటారు. ప్రతి గీతానికి ప్రత్యేకమైన రాగము, తాళము ఉన్నాయి. వాటిని చదివినా, విన్నా లేక దృశ్య రూపంలో చూసినా సరే భక్తరసికులకు సాక్షాత్తు దైవ దర్శనం కలిగిన అనుభూతి కలుగుతుంది అని ప్రతీతి. రాధామాధవుల మధ్య జరిగే రతిక్రీడలలో శృంగార రసమే కేంద్రంగా ఉన్నప్పటికీ, భావార్థం అంతా జీవాత్మ (రాధ/ ఇతర గోపికలు) పరమాత్మలో (శ్రీ కృష్ణునిలో) ఐక్యమవుటకు పడే తపన, భక్తి ఆర్ధ్రతలే ముఖ్యంగా కనిపిస్తాయి. ఇందులో ప్రధాన పాత్రలు మూడు. శ్రీకృష్ణుడు, రాధారాణి మరియు ఆమె సఖి (చెలికత్తె). కావ్యం అంతా ఈ ముగ్గురి మధ్యనే నడుస్తుంది. ఎన్నో పాశ్చాత్య బాషల్లోకి కూడా గీత గోవిందం అనువదించబడింది. నాట్యశాస్త్రంలో చర్చించబడిన అన్ని రసాలు ఈ కావ్యంలో ఉన్నప్పటికీ, శృంగార రసమే ఆ రసాలన్నింటికీ మూలముగా మరియు కేంద్ర బిందువుగా ఉన్నదని స్పష్టంగా తెలుస్తుంది.

**<u>నాట్యశాస్త్రంలోని రసములు – ఇతర 'రససమీకరణ' వాదములు :</u>**

భరతముని నాట్యశాస్త్రంలో రసములు ఎనిమిది మాత్రమే అని వివరించాడు. వీటినే 'అష్టరసాలు' అని అంటాము.

'శృంగార-హాస్య-కరుణా-రౌద్ర-వీర-భయానకాః|

బీభ-త్సాత్భుత సంజ్ఞౌ చేత్యష్టౌ నాట్యేరసాః స్మృతాః||' (నా.శా. పుట: 192) 1

అష్టరసాలు క్రింద విధంగా చెప్పబడింది.

1. శృంగారం - ప్రధాన రసం ('రసరాజము'గా ప్రసిద్ధి) – 'రతి' స్థాయీభావం
2. హాస్యం - 'హాసం' స్థాయీభావం
3. కరుణ - 'శోకం' స్థాయీభావం
4. రౌద్రం - ప్రధాన రసం – 'క్రోధం' స్థాయీభావం
5. వీరం - ప్రధాన రసం – 'ఉత్సాహం' స్థాయీభావం
6. భయానకం- 'భయం' స్థాయీభావం
7. బీభత్సం - ప్రధాన రసం- 'జుగుప్స' స్థాయీభావం
8. అద్భుతం – 'విస్మయం' స్థాయీభావం

ఈ అష్టరసాలలో కేవలం శృంగారం, రౌద్రం, వీరం మరియు బీభాత్సాలు మాత్రమే ఉత్పత్తి హేతుభూతములైన రసాలు. తక్కినవన్ని ఈ నాలుగు ప్రధాన రసముల నుంచి జనించేవి అని భరతముని వివరణ ద్వారా తెలుస్తుంది.

- శృంగారం రసం నుండి హాస్యం రసం ఉత్పన్నమౌతుంది
- రౌద్ర రసం నుండి కరుణ రసం ఉత్పన్నమౌతుంది
- వీరము నుండి అద్భుతం ఉత్పన్నమౌతుంది
- బీభత్సం నుండి భయానకం ఉత్పన్నమౌతుంది

నాట్యశాస్త్రంలో 'శాంత' రసం గురించి ఎక్కడా ప్రస్తావన లేదు. 'శాంతం' కుడా రసమే అని మొదటిగా చెప్పినవాడు 'ఉద్భటుడు'. వాడుకలో ప్రస్తుతం మనం చూసే 'నవరసాలు' (శాంత రసంతో కలిపి) గురించి మొదటగా ఉద్భటుడు ప్రస్తావిస్తే, ఆనందవర్ధన – అభినవగుప్తులు దీన్ని సమర్థించారు.

విశ్వనాధుడు తన 'సాహిత్య దర్పణం'లో 'వాత్సల్యము'ను కూడా ఒక రసంగా పరిగణించి 10వ స్థానం ఇవ్వగా, రుద్రటుడు మాత్రం తన 'కావ్యాలంకారం'లో 'ప్రేయస్సు'ను 1ంవ రసంగా చెప్పాడు. ఈ 'ప్రేయస్సు' కామ బావానికి సంబంధించినది కాదని పేర్కొన్నాడు-

'రసనా ద్రసత్వా మేషాం మధురాధీనా మివోక్త మాచార్యైః|

నిర్వేదాదిష్వపి తన్నికామ మస్తీతి తేపి రసాః||' (నా.శా. పుట: 215) 2

అంతేకాక, సంచారీభావాలు కుడా రసాలుగా అవ్వగాలవని, రససంఖ్య అనంతమని చెప్పాడు. భట్టలోల్లటుడు మొదలగువారు 49 భావాలు కూడా రసములు కాగలవని చెప్పాడు. అయితే, కాళిదాసు రాసిన 'విక్రమోర్వశీయం'లోని రెండవ అంకము - 17వ శ్లోకం, రసములు భరతముని చెప్పిన విధంగా ఎనిమిది మాత్రమే అని క్రింది విధంగా స్పష్టం చేస్తోంది.

'మునినా భరతేన యః ప్రయోగో భవతి ష్వష్టరాసాశ్రయో నిబద్ధః' (వి.మో- 2వ అం-17 వ శ్లో)

రసాలు అనేకమని, అసంఖ్యాకమని కొందరు లాక్షణికులు అభిప్రాయపడితే, మరికొందరు రసము కేవలం ఒక్కటే అని అదే, 'ఆనందం' అని చెప్పారు. అన్ని రసాలు చివరకు చేరే గమ్యం మరియు లక్ష్యం 'శాంత'మే కనుక, కేవలం 'శాంతరసం' మాత్రమే అసలైన రసమని, తక్కినన్ని రసాలకు మూలం అదేనని, సందర్భానుసారం శాంతరసమే వేరొక రసరూపంలో మనకు కనబడుతుందని 'శాంతరస ప్రకరణం' చెప్తోంది. 'ఉత్తర రామచరితం'లో భవభూతి 'ఏకో రసః కరుణ ఏవ' అన్నాడు. అనగా, కరుణ రసము మాత్రమే ప్రకృతి రసము అని ఆయన చెప్పిన నిర్వచనం. కానీ, 'శృంగార ప్రకాశం'లో రాజ భోజుడు శృంగార రసమే ప్రకృతి రసమని, ప్రధాన రసమని చెప్పెను. పస్తుత వ్యాసంలో చర్చించబడిన 'గీతగోవిందం' కావ్యం అంతా శృంగార రసమే ప్రధాన రాసంగా కలిగియున్నది.

**శృంగార రసం – దశకామావస్థలు:**

నాట్యశాస్త్రంలోని ఆరవ అధ్యాయంలో భరతముని శృంగార రస ప్రకృతుల గురించి వివరించారు. 'రతి' స్థాయీభావంగా కలిగిన ఈ రసం రెండు విధాలని చెప్పారు.

1. **సంభోగ శృంగార రసం** - ప్రియమైన వారితో కలవడం
2. **విప్రలంభ శృంగార రసం** - ప్రియమైన వారి నుండి దూరమయ్యి వివిధ మానసిక స్థితులను అనుభవించడం

కానీ, ధనంజయాదులు శృంగార రసం మూడు విధాలని ఇలా వివరించారు-

1. **అయోగము/ పూర్వానురాగము**- ప్రియమైన వారితో కలవలేని స్థితిలో ఉండటం (భరతుడు అయోగమును విప్రలంభంలోనే వివరించాడు)
2. **సంభోగము**- ప్రియమైన వారితో కలవడం
3. **విప్రయోగము-** ప్రియమైన వారి నుండి దూరమయ్యి బాధను అనుభవించడం

నాట్యశాస్త్రంలోని 22వ అధ్యాయంలో భరతముని శృంగారావస్థలు పది రకములని, వాటినే దశాకామావస్థలుగా పిలుస్తామని వివరించారు. అవి:

1. **అభిలాష**- సమాగమం కోసం ప్రియుడున్న చోటకు వెళ్లి వెదుకుట, నిలుచుండుట, రతి కేళికి ఇష్టాన్ని తెలిపే సంజ్ఞలను చూపుట
2. **చింత**- ప్రియుణ్ణి కలిసే మార్గమేది? ఉపాయమేది? ఎలా సలవగాలను? అని సఖితో చింతించుట.
3. **అనుస్మృతి**- మాటిమాటికీ నిట్టూర్పులు విడుస్తూ, కోరుకున్న సంగమం గురించి మాత్రమే ఆలోచించుట.
4. **గుణ కీర్తనం**- తన ప్రియుణ్ణి పోలినవారు లేరంటూ సఖితో గొప్పగా చెప్పుకుంటూ, ఊహల్లో ఉండుట.
5. **ఉద్వేగం**- తన ప్రియుణ్ణి కలవాలనే ఉత్సుకతలో నిలుకడను కోల్పోయిన స్థితి.
6. **విలాపం**- 'ఇదిగో ఇక్కడే కలిసేవాడు, అక్కడే కుర్చునేవాడి...' లాంటి మాటలను సఖితో పంచుకుని రోదించుట.
7. **ఉన్మాదం**- తన నాయకుడిలోని లక్షణాలను తలచుకుంటూ, ఇతర పురుషులను, వ్యక్తులను ద్వేషించుట.
8. **వ్యాధి**- దూతికలను రాయబారానికి పంపినప్పటికీ, విఫలమైన సందర్భంలో కలిగే నిరాశా నిశ్వాసాలు
9. **జడత**- నిరాశ, బాధలో మునిగి స్తబ్దుగా ఉండుట.
10. **మరణం**- అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, సంగమం జరగని పక్షంలో కలిగే విరహవేదనతో కూడిన మానసిక స్థితి.

(పూర్తి వివరణ నాట్యశాస్త్రంలో కలదు)

సందర్భానుసారం శృంగార రసం ఈ పది అవస్థలుగా వ్యక్తపరచబడుతుండి. ఇవి స్త్రీ పురుషులిద్దరికీ సమానంగా వర్తిస్తాయి.

**‘అష్టపదులు’ – శృంగార రస ప్రస్తావన:**

**‘ధన్య (దృష్ట) వైకుంఠ కుంకుమము’**

ఈ 12 వ అష్టపదిలోని కొన్ని చరణాలలో రాధ యొక్క చెలికత్తె శ్రీకృష్ణుని వద్దకు వచ్చి, రాధకు మాధవుడి పై ఎంత ప్రేమ ఉందో తెలియ చేస్తుంది. శ్రీకృష్ణునితో తన ప్రణయ భోగానికి రాధ ఎలా అలంకరించుకుంటూ ఉందో సఖి వర్ణనలో మనకు ఇలా స్పష్టమౌతుంది.

ముహురవలోకిత మండన లీలా

మధురిపురహ మితిభావన శీలా

నాథ హరే! సీదతి ......................|| (గీ.గో. 6.స. శ్లో 4. పుట 147) 3

’ఓ! కృష్ణా ! చూసావా ! మా రాధ నీతో రతి క్రీడకు తనను తాను యెంత అందంగా అలంకరించుకుంటుందో! నీకు అందంగా కనిపించడానికి తపించి పోతున్నది. ఆ ఆభరణాలు తనకు శోభనిస్తాయో లేదో అని మరలా మరలా తూచి చూస్తున్నది. తన అందాన్ని నీ దృష్టితో చూసి మురిసిపోతోంది. వెంటనే నేనే కృష్ణున్ని అని వేరే విధంగా భ్రమపడి ప్రవర్తిస్తోంది. తనను తాను నీలా ఊహించుకొని ఏవేవో ఆభరణాలను వేసి తీసి మరలా వేసి మారుస్తూ సమయాన్ని అంతా వృధా చేస్తోంది! నీతో కలయికను ఊహించుకుంటూ మైమరచి పోతున్నది, నాథా!’ అని చెలికత్తె చెప్పే మాటల్లో రాధలో ‘చింత’, ‘అభిలాషావస్థలు’ కనిపిస్తాయి.

శ్లిష్యతి చుంబతి జలధరకల్పం

హరిర్ ఉపగత ఇతి తిమిర మనల్పం

నాథ హరే! సీదతి ......................|| (గీ.గో. 6.స. శ్లో 7. పుట 147) 4

అటు చూడు మాధవా! నీ రాక ఆలస్యమయ్యే కొద్దీ రాధ విరహంతో దైన్యావస్థలోకి చేరుకుంటూ ఉంది. నీకోసం ఆ నికుంజవనంలో చీకట్లో అలంకరించుకొని ఎదురు చూస్తోంది. వనంలోని అంధకారంలో పొరబాటున నీలమేఘశ్యాముడైన నీవే తనవద్దకు వచ్చావని భ్రమపడి ఆ చీకట్లని హత్తుకొని కౌగిలిలో బంధించి చుంబించ బోయింది. నీ పై ఎంత ప్రేమో నా రాధకు !! తన కోరికను తీర్చరాదా హరీ!’ అని చెలికత్తె కృష్ణుణ్ణి విన్నవిస్తుంది. ఈ సందర్భంలో ‘మోహం’, ‘చపలత’ సంచారీ భావాలు మరియు ‘చింత’, ‘అభిలాషావస్థలు’ కనిపిస్తాయి.

భవతి విలంబిని విగళిత లజ్జా

విలపతి రోదతి వాసక సజ్జా

నాథ హరే! సీదతి .......................|| (గీ.గో. 6.స. శ్లో 8. పుట 147) 5

'స్వామి! ముద్దాడటానికి నువ్వొచ్చావని పొరబడి చీకట్లను ముద్దాడ బోయిన నా రాధ, తన చేష్టలకు తానే చిన్నబుచ్చుకుంది. సిగ్గు బిడియాలను పక్కకు పెట్టి పూల పాన్పును సుకుమారమైన లతా పుష్పాలతో అలంకరించుకుంటూ ఉంది. నీ ఆలస్యానికి రోదిస్తున్నది. తన అలంకరణ వాడిపోక ముందే నువ్వు కరుణ చూపి తనదరికి చేరరాదా?' అన్న సఖి మాటల్లో రాధ 'అనుస్మృతి', 'ఉద్వేగావస్థ'లకు లోనైనట్టు స్పష్టమౌతుంది.

ఈ అష్టపదిలోని పై చరణాలలో మనకు రాత్రి అంతా తన ప్రియుడు తనతో సంతోషంగా రాసలీల జరపడానికి కావలసిన విధంగా రాధ తనను తాను అందంగా అలంకరించుకొని, వీలుగా నివాస ప్రదేశాన్ని కూడా అలంకరించుకొని కృష్ణుడు ఎప్పుడొస్తాడో అని ఆశగా ఎదురు చూసే 'వాసకసజ్జిక నాయికా' లక్షణాలతోపాటు, 'విలపతి రోదతి' అన్న మాటల్లో యెంత ఎదురుచూసినా కృష్ణుని జాడ తెలియలేదనే విరహ బాధ కూడా రాధలో కనిపిస్తుంది. (పై చర్చించిన అంశాలను గురు కేలుచరణ్ మహాపాత్ర, వెంపటి చిన్నసత్యం, కృష్ణవేణి లక్ష్మణన్ వంటివారి నృత్య రూపకల్పనల్లో, షరాన్ లోవెన్, సంజుక్త పాణిగ్రాహి, గాయత్రీ కృష్ణవేణి లక్ష్మణన్ వంటివారి ప్రదర్శనల్లో గమనించవచ్చు)

**<u>'హరి వల్లభ శోక పల్లవం' (అష్టపది 8)</u>**

సౌరాష్ట్ర రాగం, ఏక తాళంలో ఉన్న ఈ ఎనిమిదవ అష్టపదిలో సఖి రాధ యొక్క విరహ వేదనను శ్రీ కృష్ణునికి చేరవేస్తూ ఇలా రాయబారం చేస్తున్నది.

నిందతి చందన మిందుకిరణ మనువిందతి ఖేదమధీరం

వ్యాళనిలయ మిళనేన గరళమిన కలయతి మిలయ సమీరం

మాధవ మనసిజ విశిఖ భయాదివ భావన

యాత్వయిలీనా సావిరహే తవ దీనా || (గీ.గో. 4.స. శ్లో 1. పుట 141) 6

'ఓ కృష్ణా! మన్మధుడు వేసే బాణాలకి ఆ సుకుమారి తట్టుకోలేక పోతోంది. నిండు వెన్నెలను తిడుతోంది! చల్లని గాలిని ఛీదరించుకుంటోంది! పూల గంధాలను దూషిస్తోంది! పరిమళాలను విషవాయువులుగా చూస్తోంది. ఈ వేదన నుంచి రాధకు నీవే ఉపశమనం కలిగించగలవు స్వామీ!' అన్న సఖి మాటల్లో రాధ 'అనుస్మృతి', 'ఉద్వేగము', 'విలాపము' వంటి అవస్థలను గమనించగలం.

అవిరళ నిపతితమదన శరాదివభవదవనాయ విశాలం

స్వహృదయ మర్మణి వర్మకరోతి సజల నళినీదళ జాలం || (గీ.గో. 4.స. శ్లో 2. పుట 141) 7

'నాథా! రాధకు నీవంటే ఎంతో ప్రీతి. మన్మధుడు వేసే పూలబాణాలు తన హృదయంలో ఉన్న నీకు ఎక్కడ గుచ్చుకుంటాయో అని చింతిస్తూన్నది. తన హృదయాంతరంగంలో ఉన్న నిన్ను ఆ బాణాల బారి నుండి కాపాడుకోవటానికి తామరాకులను తన స్థనాలకు అడ్డు పెట్టి ప్రేమతో కప్పుకుంది. ఆ తామరాకులపై ఉన్న నీటి బిందువులతో మనస్సులోని విరహాగ్నిని చల్లార్చడానికి ప్రయత్నిస్తోంది. నీవు తనను చేరరాదా!' అని చెలికత్తె చెప్పిన మాటల్లో మనకు రాధలో 'అవహిత్థం', 'విభ్రమం' కనిపిస్తాయి. 'చింత', 'దైన్యం', 'జడత'వంటి సంచారీ భావాలతో కూడిన ఉద్వేగము, అనుస్మృతి, చింత వంటి కామావస్థలున్నాయి.

వహతిచ వలితవిలోచన జలధర మానస కమలముధారం

విధుమివ వికటవిధుం తుద దంతదలన గలితామృతధారం || (గీ.గో. 4.స. శ్లో 5. పుట 141) 8

కృష్ణా! ఇప్పుడు రాధ నేత్రాలు విరహ దుఃఖంతో జలమయమైనాయి. ప్రవిస్తున్న చంద్ర బింబంలా ముఖము వాడిపోయింది. ఆ జాబిలిలాంటి మోముకు విరహంతో గ్రహణం పట్టింది, స్వామీ!' అన్న సఖి మాటల్లో మనకు రాధలో 'అశ్రువు', 'వైవర్ణ్యం', 'ప్రళయం' వంటి సాత్విక భావాలతోపాటు 'విభ్రమము', 'కిలకించితము' మొదలైన సమాన్యాలంకారాలను చూడగలం. 'అపస్మారం', 'దైన్యం', 'చపలత', 'మోహం', 'జడత'వంటి సంచారీ భావాలు కలిగిన చింత, జడత, విలాపావస్థలను కూడా గమనించగలం.

ధ్యానలయేన పురః పరికల్ప్య భావంత మతీత దురాపం

విలసతి హసతి విషీదతి రోదతి చంచతి ముంచతి తాపం || (గీ.గో. 4.స. శ్లో 8. పుట 141)

9

'స్వామీ! రాధ విరహ వేదనలో మునిగిపోయింది. ఆ బాధలో ఏ చింతా లేని నీ ముఖాన్ని చూసి 'ఓ మాయలకారీ! ఎందుకొచ్చావు? ఇంతసేపు దేనితో ఉన్నావో అక్కడికే పో! అని అరుస్తుందేమో! బాధలో నవ్వుతుంది. తన రోదన నీకు పట్టదని నిరశంతో నిట్టూర్పు విడుస్తుంది. అవేమి పట్టించుకోకు మాధవా!! ఒకవేళ నువ్వు కోపంలో తనని విడిచి వచ్చేస్తే, నా రాధ నువ్వు తిరిగి రావేమో అని అవధులు లేకుండా రోదిస్తుంది. విరహాగ్నిలో దహించుకు పోతుందేమో అని చింతగా వుంది. నీవు కాస్త తన మనసెరిగి నడుచుకోరాదా కృష్ణా!' అన్న సఖి మాటలు రాధలోని శోక భావాన్ని చూపుతున్నాయి. 'ఉగ్రత', 'మతి', 'చపలత', 'ఉన్మాదము'లు సంచారీ భావాలు. రాధ మనసులో శోకానికి కారకమైన 'రతి' భావాన్ని కృష్ణునికి చేరవేసి, రాధపై కరుణ చూపమని విన్నవిస్తుంది.

ఈ అష్టపదిలో 'రతి'భావము 'క్రోధం'లా, శోకంలా కనిపించినప్పటికీ, చేష్టలలో 'విప్రలంభ శృంగార' రసమే ప్రస్ఫుటంగా కనబడుతుంది. (పై చర్చించిన అంశాలను గురు కేలుచరణ్ మహాపాత్ర, ధనంజయన్స్ వంటివారి నృత్య రూపకల్పనల్లో, షరాన్ లోవెన్, గాయత్రీ కృష్ణవేణి లక్ష్మణన్ వంటివారి ప్రదర్శనల్లో గమనించవచ్చు)

**<u>'నాగర నారాయణ రసావలయం' (అష్టపది 13)</u>**

ఈ పదమూడవ అష్టపదిలోని కొన్ని చరణాలలో మాధవుని ప్రణయ వలయంలో ఇరుక్కుపోయిన రాధ యొక్క మనసులోని భావాలను జయదేవులు ఈ విధంగా వర్ణిస్తున్నారు.

కథిత సమయేపి హరి రహః! న యయవ్వనం | మమల విఫల మిద మమల మపి యవ్వనం రూప ||

యామి హే! కమిహ శరణం | సఖీ జనవచన వంచితాహం || (గీ.గో. 7.స. శ్లో 3. పుట 149) 10

'ఆ నారాయణుని గురించి నా సఖులు చెప్పిన గొప్ప మాటలను నమ్మి ఇక్కడిదాకా వచ్చి ఇరుక్కుపోయానే! మాయమాటలు చెప్పి కృష్ణ మాయలోకి నన్ను లాగారు. అయ్యో! దేవుడా! ఈ అడవిలో కృష్ణుని కోసం వచ్చి దిక్కు తెలిక చిక్కుకుపోయానే! ఆ కృష్ణుడు ఫలానా చోటకు ఈ సమయానికి వస్తానని కబుర్లు చెప్పి ఇప్పుడు కనిపించడం లేదే! అలస్యం అయ్యే కొద్దీ ప్రతీ క్షణం ప్రేమలో మునిగిపోయేలా ఉన్నానే! నాకీ అందం ఎందుకు? మెరుపెందుకు? అసలి కృష్ణునితో ప్రేమెందుకు? వ్యర్థం కాకపోతే!' అన్న రాధ మాటల్లో 'అపలాపము', 'విలాపము', 'అనులాపము' వంటి వాచికాభినయ ధోరణులను సాహిత్యంలో గమనించగలం.

యదనుగమనాయ నిశి గహన మాపి శీలితం

తేన మమ హృదయ మిద మాసమ శరకీలితం || (గీ.గో. 7.స. శ్లో 4. పుట 149) 11

'ఆ కృష్ణునిపై తనివితీరని ప్రేమతో,నా కోరికలను ఆపుకోలేక ఇక్కడకు వచ్చి ఈ అంధకారంలో తగులుకు పోయానే! విధి లేక ఈ నిశిరాత్రులలో నేను ఈ బృందావం మొత్తం వెతికినా కూడా అతడి జాడ లేదు. ఆ మాయలమారి నన్ను ఇక్కడ మన్మధ బాణాలకు వదిలేసి ఏ వయ్యారితో డోలికలూగుతున్నాడో! ఇప్పుడేమి చెయ్యాలి? నేను ఈ వెన్నెల్లో ఇంటికి తిరిగి వెళితే అందరి దృష్టిలో పడి నా గుట్టు బయలౌతుంది. అయ్యో దేవుడా! హతవిధీ!' అని రాధ చెప్పిన మాటల్లో మనకు 'అనుస్మృతి', 'ఉద్వేగము' వంటి కామావస్థలు, మరియు 'అపలాపము', 'విలాపము', 'అనులాపము' వంటి వాచికాభినయ ధోరణులు కనిపిస్తాయి. 'వ్రీడ', 'విభోదము', 'చింత', 'దైన్యం' వంటి సంచారీ భావాలు కనిపిస్తాయి.

మమ మరణమేవ వరమతి వితథ కేతనా

కిమితి విషహామి విరహానల మాచేతనా|| (గీ.గో. 7.స. శ్లో 5. పుట 149) 12

'ఈ చోటులో ఎంతసేపు గడపగలను? ఈ విరహాన్ని ఎంతసేపు భరించగలను? ఆ చోరునికోసం వనం అంతా వెతికి వెతికి అలిసిపోయాను. నా యవ్వనం మొత్తం వ్యర్థంగా అడవుల పాలైంది. ఇంతకంటే మరణమే మేలు కదా!' అనే రాధ భావనలో మనకు 'మరణము', 'వ్యాధి', 'ఉద్వేగము', 'అనుస్మృతి' కామావస్థలలో 'వ్రీడ', 'ప్రభోదము', 'అవేగము', 'చింత', 'దైన్యం' మొదలైనవి కనిపిస్తాయి.

అహ మిహ హి నివసామి నవిగణిత వేతసా

స్మరతి మధుసూధనో మా మాపి న చేతసా || (గీ.గో. 7.స. శ్లో 9. పుట 150) 13

'నా ప్రాణం అంతా అతని ఊహలతోనే కొట్టుమిట్టాడుతూ ఉంది కదా! నేను ఇంత బాధ పడుతున్నా కూడా అతని రాకకి ఆనవాలు లేవే! నా సఖుల మాటలు వినకుండా ఉండాల్సింది. ఇప్పుడు నేను ఇక్కడ కూర్చొని చెట్లు లెక్క పెట్టడం తప్ప ఏమి చెయ్యాలి దేవుడా! ఏమిటి నాకీ బాధ! ఏమి చెయ్యాలి? నా మనసంతా అతని స్మృతులతోనే నిండిపోయింది' అని రాధ చెప్పిన మాటల్లో మనకు 'స్మృతి', 'చపలత', 'శ్రమ','వ్రీడ', 'అవేగము' వంటి సంచారీ భావాలు కనిపిస్తాయి.

ఈ అష్టపదిలోని పై చరణాలలో ప్రియుడు ఫలానా సమయంలో, ఫలానా చోటులో కలుద్దామని చెప్పి మాటిచ్చి రాకపోయినప్పుడు లేదా ఆలస్యం చేసినప్పుడు, శృంగార కోరికలతో నాయికుడు చెప్పిన చోటకు వచ్చి, పూలతో పాన్పును సిద్ధం చేస్కొని, ప్రియుని కోసం ఎదురు చూసి నిరస పోయి సతమతమవుతున్న 'విప్రలబ్ధ

నాయికా' లక్షణాలను రాధలో చూడగలం. కృష్ణుడు తన వద్దకు వస్తానని చెప్పి ఇప్పటి వరకు ఎందుకు రాలేదు? కారణం ఏమై ఉంటుందో అని తనలో తనే కలవర పడుతున్న రాధలో 'అనుస్మృతి', 'చింతా'వస్థలు, 'అశ్రువు' సత్వికభావంగా కనిపిస్తాయి.

మామహహ! విధురయతి మధుర మధుయామినీ

కాపి హరి మనుభవతి కృత సుకృత కామిని || (గీ.గో. 7.స. శ్లో 6. పుట 149) 14

'కృష్ణుడు ఇప్పటిదాకా రాక పోవడం ఏమిటి? ఇలా ఇంతవరకు యెప్పుడు చెయ్యలేదు కదా! ఏదో పెద్ద కారణమే ఉండాలి. బహుశా ఏ వయ్యారి వలలోనైనా చిక్కుకున్నాడా? దాని శృంగార కేళిలో పడి నా దగ్గరకు రావడం మరిచిపోలేదు కదా! అయినా ఇంత చల్లని వెన్నెల రాత్రిలో నా కృష్ణున్ని వలలో వేసుకున్న ఆ వగలాడి యెంత భాగ్యశీలో కదా! ఈ విరహతాపంలో ఆ చంద్రకిరణాల కాంతిని నేను ఎలా తట్టుకోవాలి?' అని రాధ చెప్పిన మాటల్లో మనకు 'శంక', 'అసూయ', 'వితర్కం', 'అవేగము', 'చింత', 'దైన్యం' వంటివి సంచారీ భావాలున్నాయి.

తత్కిం కామపి కామినీ అభిసృతః కిం వా కలాకేళిభిహి | బద్ధో బంధుభిహి! రంధకారిణీ వనాభ్యర్ణే కిం ఉద్భ్రామ్యతి ||

కాంతః క్లాంతమనా మనాగపి పథి ప్రస్థాతుమేవా క్షమః| సంకేతీ కృత మంజు వంజుళ లతా కుంజేపి య న్నాగాతః||

(గీ.గో. 7.స. శ్లో 11. పుట 15౦) 15

'నన్ను ఈ నికుంజ ప్రదేశంలో విరహాగ్నికి వదిలేసి ఆ శఠుడు ఏ టక్కులాడితో వగలుపోతూ కులుకుతున్నాడో! లేక నన్ను కలవడానికి వచ్చేటప్పుడు దారి మధ్యలో బంధువులు ఆపేశారా! వాళ్ళతో ఆడుకుంటూ నన్ను మరిచిపోయాడా? లేక ఈ చీకట్లో తప్పిపోయాడా? ఎందుకు రాలేకపోయాడు?!' అని రాధ చెప్పిన ఈ మాటల్లో కూడా మనకు 'శంక', 'అసూయ', 'వితర్కం', 'అవేగము', 'చింత', 'దైన్యం' వంటివి సంచారీ భావాలు, 'మొట్టాయితము', 'కిలకించితము', మొదలైన సామాన్యాలంకారాలతో పాటు 'చింత', 'ఉద్వేగం' వంటి కామావస్థలు కనిపిస్తాయి.

ఈ అష్టపదిలో నాయకుడి జాడ లేకపోవడంతో, ప్రియుడు రాకపోవడానికి గల కారణము ఏమైయ్యి ఉంటుందో అని చింతిస్తూ, తనలో తనే ఏవేవో ఊహించుకునే 'ప్రోషితభర్తృక నాయికా' లక్షణాలుగా గుర్తించగలం. విరహంతో కూడిన 'విప్రలంభ శృంగార రసం' ప్రధానంగా ఉంది.

(పై చర్చించిన అంశాలను గురు కేలుచరణ్ మహాపాత్ర గారి నృత్య రూపకల్పన, షరాన్ లోవెన్ వంటివారి ప్రదర్శనల్లో గమనించవచ్చు)

**<u>లక్ష్మి పతి రత్నావళి (అష్టపది 17)</u>**

ఈ పదిహేడవ అష్టపదిలో రాధ కృష్ణుని పై బాధతో కూడిన ఆగ్రహాన్ని చూపిస్తుంది.

రజని జనిత గురు జాగర రాగ కషాయిత మలసనిమేషం

వహతి నయనమనురాగ మివస్ఫుట ముదిత రసాభినివేశం|

యాహి మాధవ! యాహి కేశవ!! మావదకైతవ వాదం

తామనుసర సరసీరుహ లోచన! యాతవ హారతి విషాదం|| (గీ.గో. 8.స. శ్లో 1. పుట 154) 16

'ఓ మాధవా! పో! పో! నీ మోసపూరిత మాటలు నాకు చెప్పకు. రాత్రంతా ఏ స్త్రీతో గడిపి వచ్చావు నీవు? నీ కళ్ళు చూడు నిరశంగా మూతబడిపోతున్నాయి. ఎర్రబడ్డ నీ నయనాలే నీ మోసానికి సాక్ష్యం. వెన్నెల్లో ఏ యువతితో ఆనందించావో దాని దగ్గరకే పో కేశవా! పో! నిన్ను వదిలి నేను ఉండలేను అని మాటలు చెప్పి మాయ చెయ్యకు!' అంటుంది రాధ. కృష్ణుడు 'అయ్యో! లేదు సఖీ! నీ కోసం చీకట్లో రాత్రంతా నికుంజవనంలో వెతికి వెతికి అలిసిపోయి నా కళ్ళు ఎర్రబడ్డాయి, అంతే!!!', అంటూ రాధను చల్లపరచడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఇక్కడ మనకు రాధ ముఖంలో 'క్రోధం' భావం కనిపించినప్పటికీ, అంతర్భావంలో 'శోకంతో కూడిన రతి' స్థాయీ భావంగా ఉంది. ప్రవర్తనలో పైకి 'రౌద్ర' రసం ప్రదర్శించినా, తన ఖండిత చేష్టలలో 'విప్రలంభ శృంగార' రసమే ప్రస్ఫుటంగా కనబడుతోంది.

కజ్జల మాలిన విలోచన చుంబన విరచిత నీలమ రూపం

దసనపసన మరుణం తవ కృష్ణా! తనోతి తనోతనరూపం|| (గీ.గో. 8.స. శ్లో 2. పుట 154) 17

'అయ్యో పాపం!! అలా అయితే నీ యెర్రని పెదవులపై ఆ వయ్యారి కళ్ళకు ఉండే నల్లని కాటుక మరకలు ఎలా అంటిందో చెప్పు? ఇంక అబద్ధం చెప్పకు. నీ కష్ట సుఖాలన్నీ దానితోనే ఏకాంతంగా చెప్పుకో. పో కేశవా! వెళ్లి పో మాధవా!!' అంటుంది రాధ.

వపురనుహరతి తవస్మర సంగర ఖరన ఖరక్షత రేఖం

మరకత శకలకలితకల ధౌతలి పేరివ రతి జయలేఖం|| (గీ.గో. 8.స. శ్లో 3. పుట 154) 18

'నువ్వు దానితో ఎంత ఘాటుగా రమించకపోతే, ఆ భామిని రత్యాంత సుఖానికి తాళలేక నీ వీపు పై తన గోళ్ళతో అంత ఘట్టిగా రక్కి చారలు ముద్రిస్తుంది?! ఆ గోళ్ళ మరకలు నా కళ్ళకు ఆ వయ్యారి నా పై ఎగరేసిన విజయపతాకంలా కనిపిస్తోంది. వెళ్లి దాని దగ్గరే నీ కోరికలు చెప్పుకో, నీ వీపుపై గాయాలకు అదే మందు రాస్తుంది. ఇంక నాకు నీ కబుర్లు చెప్పకు కృష్ణా!' అంటుంది రాధ.

కృష్ణుడు 'లేదు సఖీ! నీ కోసం వనంలో వెతుకుతూ వస్తుంటే ఆ చెట్లకున్న కొమ్మలు గీసుకుపోయి అలా మరకలు పడ్డాయి అంతే! కావాలంటే చూడు!', అంటాడు.

రాధ 'ఆహా!!! యెంత గొప్పగా చెప్పావు. అయితే నీ చాతిపై ఈ పారాణి గుర్తులు ఎక్కడి నుండి వచ్చాయో! అది యెంత నైపుణ్యవతి కాకపోతే పారాణితో ఇలా నీ చాతి పై రంగవల్లి దిద్దింది!' అంటే, కృష్ణుడు లేదు సఖీ! అవి నీకోసం వస్తుంటే ఆ చెట్లకున్న మందార పుష్పాల రాపిడికి రంగు అంటుకుంది. కావాలంటే పరిశీలించు! అంటాడు. రాధ 'నీవు అబలలను కబళించే రాక్షసుడివి. పో మాధవా! పో కేశవా!!' అని పదునైన మాటలతో కోపాన్ని చూపి నిందిస్తుంది. కృష్ణుడు దుఃఖంతో వెళ్ళిపోతాడు.

పైన చరణాలు అన్నింటిలో మనకు రాధలో 'వైవర్ణ్యం', 'ప్రళయం' వంటి సాత్విక భావాలు, 'మొట్టాయితము', 'కిలకిన్చితం', 'ప్రాగాల్భ్యము' మొదలైన సహజ అలంకారాలు అభినయంలో కనిపిస్తాయి. ఇందులో 'గ్లాని', 'శంక', 'అసూయ', 'వితర్కం', 'ఉగ్రత', 'మతి', 'చపలత', 'ఉన్మాదము' వంటివి సంచారీ భావాలు. ముఖ విలువలో 'రతి' స్థాయీ భావము 'క్రోధం'లాగా కనిపించినప్పటికీ, ప్రవర్తనలో పైకి 'రౌద్ర' రసం ప్రదర్శించినా, చేష్టలలో 'విప్రలంభ శృంగార' రసమే ప్రస్ఫుటంగా కనబడుతోంది. నాయకుడిలో 'దైన్యం', 'చింత', 'శోకం' వంటి భావాలున్నాయి. నాయకుడిలో 'ఉద్వేగం', 'అనుస్మృతి', నాయికలో 'చింత', 'ఉన్మాదములు' కామావస్థలు చూడగలం.

ఈ అష్టపదిలో శరీరంపై శృంగారపు తాలూకు గుర్తులను చూసి మండిపడిన మనసుతో ఆవేశాన్ని ప్రియునిపై చురకలుగా చూపుతున్న 'ఖండిత నాయికా' లక్షణాలు రాధలో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

(పై చర్చించిన అంశాలను గురు కేలుచరణ్ మహాపాత్ర, సుధారాణి రఘుపతి, సోనాల్ మాన్సింగ్, ఇందిరా కదంబి, షరాన్ లోవెన్ వంటివారి నృత్య రూపకల్పనలు మొదలైనవాటిలో గమనించవచ్చు)

**<u>ఆమంద ముకుందం (అష్టపది 18)</u>**

ఈ పద్దెనిమిదవ అష్టపదిలో తన కృష్ణున్ని ఎన్నో మాటలు అని బాధించిన రాధ అతడు వెళ్ళిపోగానే విరహంతో చింతిస్తున్న ఘట్టం మనకు కనిపిస్తుంది.

హరిరభిసరతి వహతి మధుపవనే

కిమపర మదిక సుఖం సఖీభావనే మాధవే

మా కురు మానిని! మానమయే|| (గీ.గో. 9.స. శ్లో 2. పుట 156) 19

చెలికత్తె రాధతో ఇలా అంటుంది,' హే సఖీ! నీవెందుకు శ్రీహరిపై అంత కోపాన్ని చూపావు? నీ మాటలకు అతనెంత చింతిస్తున్నాడో పాపం! అయినా అతగాడి వేషాలు మనకేమి కొత్త కాదు కదా! అలా చూడు! అతడు ఇంత చల్లని సమయంలో నిన్ను కలుసుకోవాలని వస్తే నీ ఆనందాన్ని నువ్వే పాడుచేసుకున్నావు. ఇప్పటికీ మించిపోయింది లేదు. త్వరగా మాధవుడు ఉండే పొదరింటికి వెళ్లి నీ ప్రేమను పండించుకో. సఖీ! అతని చెలిమిని వదిలి నువ్వుండలేవు. ఈ బృందావనము మీ కలయికకోసం పాన్పు పరిచింది. వెళ్ళు!' అంటుంది. ఇందులో 'చింత', 'దైన్యం', 'జడత'వంటివి  సంచారీ భావాలు. 'క్రోధంలా తలపించే రతి' స్థాయీ భావము.

సజల నళినీ దళ శీతల శయనే

హరి మావా లోకయ సఫలయ నయనే || (గీ.గో. 9.స. శ్లో 6. పుట 156) 20

'సఖీ! నీ కోసం కృష్ణుడు ఆ పొదరింటిలో తామరాకు పాన్పుపై పడుకొని తన వేణువుతో విరహ రాగాలను పుట్టిస్తున్నాడు. నీ రతికేళికి ఇదే మంచి వేళ. చూడు నువ్వు కృష్ణున్ని ఎంత బాధ పెడుతున్నావో! అది నీకే మంచిది కాదు సుమా! నిండుగా శోభిల్లుతున్న నీ పూర్ణ స్థనాలను వ్యర్థం చేసుకోకు. వెళ్లి ఐక్యమవ్వు! అతనికి నీపై ఎంత ప్రేమ

ఉందో నీకు కూడా తనపై అంతే ప్రేమ ఉంది కదా!' అంటుంది రాధ సఖి. ఇందులో 'గ్లాని', 'మోహం', 'ఆవేగం', 'స్మృతి', 'విషాదం', 'జడత'వంటివి  సంచారీ భావాలు. 'విరహంతో కూడిన రతి' స్థాయీ భావము.

హరిరుపయాతు వదతు బహు మధురం| కిం ఇతి కరోషి హృదయ మతి విధురం||

స్నిగ్ధేయత్పరుషాశి యత్ప్రణమతిస్తబ్ధాసి యద్రాగిణి| ద్వేషస్థాసి యదున్ముఖే విముఖతాం యాతాసి

తస్మిన్ ప్రియే||

(గీ.గో. 9.స. శ్లో 8. పుట 156) 21

'సఖీ! అసలు ఈ పరిస్థితికి నీ మొండి తనమే కారణం. విపరీత చేష్టలు చేసి ప్రియున్ని దూరం చేసుకొంటున్నావు. ఇప్పుడు నీవు అనుభవించే విరహానికి కారణం నువ్వే కదా! స్వయంకృతాపరాధము! కృష్ణుడు నీ వద్దకొచ్చి నమస్కరించి మరీ బ్రతిమాలినా సరే నువ్వు కనికరించలేదు. పాపం ఆ సున్నితమనస్కున్ని శత్రువు లాగ చూసి రాక్షసుడన్నావు. దగ్గరకొస్తే తోసేశావు. ఇప్పుడేమో చింతిస్తూ తపించిపోతున్నావు. నీ చింతకి ఒక్కటే పరిష్కారం. మనోహరుడైన ఆ స్వామిని చేరి, తనకు దగ్గర కావడానికి ప్రయత్నించు.' అని చెలికత్తె అంటుంది. కాని రాధ తనని కృష్ణుడు కోపంతో దగ్గరకు తీస్కోకుండా ఎడబాటుకు గురి చేస్తాడేమో అని భయపడుతుంది. ఆ విముఖతను సహించగలిగే శక్తి తనలో లేదని రోదిస్తుంది. అప్పుడు చెలికత్తె 'బాధపడుతావు ఎందుకు చెలి!? ఆ శ్రీ హరి నువ్వు వెళ్ళగానే తనంతట తానే వచ్చి నిన్ను చేరతీసుకుంటాడు. ప్రేమగా మాట్లాడుతాడు. ధైర్యంగా వెళ్ళు ప్రియా!' అని రాధకు ఉత్సాహాన్నిస్తుంది.

ఈ అష్టపదిలో 'విలాపము', 'చింత', 'ఉద్వేగము', 'అనుస్మృతి' వంటివి కామావస్థలుగా కనిపిస్తాయి. ప్రియుడు చిన్నబుచ్చుకొని వెళ్ళిపోగానే అయ్యో!! తప్పు చేసానేమో అని దుఃఖిస్తూ మళ్ళీ తన ప్రియుడు తన దగ్గరకు ఎప్పుడొస్తాడో! అని చింతించే 'కలహాంతరిత నాయికా' లక్షణాలు రాధలో కనిపిస్తే, నాయకుడి స్వభావములో 'తేజస్సు', 'ఔదార్యం' సత్వాలంకారాలుగా ఉన్నాయి. రసం 'విప్రలంభ శృంగారం' మరియు 'శోకంతో కూడిన రతి' స్థాయీ భావము.

(పై చర్చించిన అంశాలను మాధవి ముద్గల్ గారు చేసిన 'మాధవే మాకురు మానిని' వంటి నృత్య రూపకల్పనలు మరియు ప్రదర్శనల్లో గమనించవచ్చు)

**<u>సాకాంక్ష పుండరీకాక్షోత్కంఠామధురం (అష్టపది 11)</u>**

ఈ 11వ అష్టపదిలో రాధ చెలికత్తె చెప్పిన మాటలు విని, కృష్ణుని వద్దకు తానే వెళ్ళడానికి సుముఖంగా ఉంటుంది. అదే మంచి సమయం అని చెలికత్తె త్వరగా కృష్ణుని దగ్గరకు వెళ్ళమని తొందర పెడుతుంది.

ముఖర మధీరం త్యజమంజీరం రిపుమివ కేళిషులోలం

చలసఖి కుంజం సతిమిర పుంజం శీలయ నీల నిచోలం|| (గీ.గో. 5.స. శ్లో 11. పుట 145) 22

కృష్ణున్ని కలవడానికి వెళుతున్న రాధతో చెలికత్తె 'సఖీ! త్వరగా వెళ్ళు! కానీ ఒక్కమాట ! మీ ఇద్దరి రతి కేళి సమయంలో నీ చెవికి ఉన్న కర్ణాభరణాలు శబ్దం చేస్తాయేమో! ఆ శబ్దం అందరికీ వినిపించి మీరిద్దరూ చీకట్లో ఎక్కడున్నారో తెలిసిపోతుంది. కాబట్టి వాటిని తీసేసి వెళ్ళు! ఆ కృష్ణుడు నిన్ను డోలికలూపినప్పుడు నీ కాలికి ఉన్న మువ్వలు గోల చేస్తాయి. వాటిని కూడా ధరింపకు సుమా! నీ మెరుపులాంటి శరీర కాంతి వలన ఈ బృందావన ప్రజలందరి దృష్టిలో పడుతావు. అందరూ నిన్ను ఈ రాత్రి వేళ ఎక్కడికి పోతున్నావని అనుమానిస్తారు. కనుక నీ వెన్నెలలాంటి శరీరాన్ని ఈ నల్ల దుప్పటితో కప్పుకొని వెళ్ళు. త్వరగా!!' అంటుంది. రాధ అలాగే చేస్తుంది.

హరిరభిమానీ రజని రిదానీ నియమపియాతి విరామం

కురుమమ వచనం సత్వర రచనం పూరయ మధురిపు కామం|| (గీ.గో. 5.స. శ్లో 14. పుట 145) 23

'చూడు సఖీ! అసలే కృష్ణుడికి అభిమానం చాలా ఎక్కువ. నువ్వు ఇన్ని మాటలు అన్నా ఆ మాధవుడు యమునా తీరాల్లో నీకోసం ఇంకా ఎదురు చూస్తున్నాడు. నువ్వు ఆలస్యం చేస్తే అతగాడు ఇంకెక్కడికైనా వెళ్ళిపోతాడు! ఆలస్యం చెయ్యకుండా కామాభిసారికలా వెళ్లి అతని కోరికను మన్నించు!' అని చెలి చెప్పినవెంటనే రాధ ప్రేమాభిసారికలా వెళ్ళింది. ఇక్కడ కృష్ణుడు రాధ కోసం చూసే ఎదురుచూపులో అభిలాషావస్థ తెలుస్తుంది.

ఈ రెండు చరణాలలో 'ఔత్సుకత', 'లజ్జ', 'గర్వ', 'హర్షము' వంటివి సంచారీ భావాలు. ఈ చరణంలో రసం 'శృంగారం' మరియు 'రతి' స్థాయీ భావము. ఈ అష్టపదిలో ఎన్ని అడ్డంకులు ఉన్నా తన ప్రియున్ని కలుసుకునేందుకు తానే ధైర్యం చేసి బిడియాన్ని పక్కనబెట్టి ముందుకు సాగే 'అభిసారిక నాయికా' లక్షణాలు రాధలో కనిపిస్తున్నాయి. విప్రలంభ శృంగార రసం నుండి సంభోగ శృంగార రసంగా మారే సూచనలు కనిపిస్తాయి.

(పై చర్చించిన అంశాలను గురు కేలుచరణ్ మహాపాత్ర, A.జనర్ధనన్ వంటివారు చేసిన 'ధీర సమీరే' నృత్య రూపకల్పనలు మరియు ప్రదర్శనల్లో గమనించవచ్చు)

**<u>సుప్రీత పీతాంభర తాళ శ్రేణి (అష్టపది 24)</u>**

ఇరవై నాల్గవ అష్టపదిలో తన ప్రియునికి దగ్గరైన రాధ సంతోషంతో రాసక్రీడానంతరం కృష్ణున్ని ప్రియంగా తన తన జడ సవరించమని, కాటుక దిద్దామని, పవిట సర్దమని మొదలైన శృంగారభరితమైన ఆజ్ఞలను సున్నితంగా ఇలా వేస్తుంది.

అళికుల గంజన మంజనకం రాతినాయక సాయక లోచనే

త్వధర చుంబన లంబిత కజ్జల ఉజ్జ్వలయ ప్రియ లోచనే|| (గీ.గో. 12.స. శ్లో 13. పుట 166) 24

'ఓ గోవిందా! మన్మధ దాడికి సంతోషించి నీవు నా కనురెప్పలను మాటిమాటికీ స్పృశించావు. నీ అధర స్పర్శకు నా కాటుక కాంతి నీ అధరాలకు అంటుకుంది. నీవిప్పుడు ఆ కాటుకలను సరిచేసి నా నేత్రాలను శోభింప చేయుము.' అని రాధ అనగానే కృష్ణుడు శిరసావహించి రాధ కళ్ళకు కాటుకను దిద్దాడు.

మృగమద రస వలితం లలితం కురుతిలక మళిక రజనీకరే

విహిత కళంక కళం కమలానన విశ్రమిత శ్రమశీకరే || (గీ.గో. 12.స. శ్లో 16. పుట 166) 25

'నారాయణా! రాసక్రీడలో పుట్టిన స్వేద జలాలతో, అలసటతో నా మోము కాంతివంతమైంది. కపోల చుంబనాలతో నా బొట్టు చెదిరింది. అందమైన నీ చేతులతో నా నుదుటున తిలకాన్ని దిద్దు స్వామీ!' అని రాధ చెప్పగానే కృష్ణుడు 'స్మిత హాసం' చేస్తూ రాధ నుదుటున తిలకాన్ని దిద్దుతాడు.

మమరుచిరే చికురే కురు మానద! మనసిజ ధ్వజ చామరే

రతిగలితే లలితే కుసుమాని శిఖండి శిఖండకడామరే|| (గీ.గో. 12.స. శ్లో 17. పుట 166) 26

'ఓ గోపీలోలా! నావంటి యవ్వన యువతుల మానసచోరా! రతిశ్రుతిలో నా అందమైన శిరోజాలు పట్టు తప్పి వీడిపోయాయి. నెమలి పింఛంలా అలరారుతూ ఉండే నా శిరోజాలను సరి చేసి కొప్పులో సుగంధ పుష్పాలను అలంకరించు నాథా!' అని రాధ అనగానే రాధ కొప్పుని సవరించి పుష్పాలతో అమర్చి కేశ సౌందర్యాన్ని వీక్షించి మురిసిపోయాడు.

సరస ఘనే జఘనే మమ శంబరదారణా వారణ కందరే

మణి రశనా వసనాభరణ నిశుభాశయ! వాసాయ సుందరే|| (గీ.గో. 12.స. శ్లో 18. పుట 167) 27

'మాధవా! నీ పావన హస్తాలతో నా జఘన దేశాన్ని మణిమయ మొలనూలులతో అలంకరించుము. నీవు వడ్డానాలతోను, పట్టు వస్త్రాలతోను నా జఘనమును బిగించి కట్టు' అని రాధ అనగానే శ్రీ కృష్ణుడు రాధ జఘనాన్ని అలంకరించి ఆజ్ఞలను శిరసావహించాడు. ఇదంతా చూసిన మన్మధుడు తాను సంధించిన బాణాలు వృథా కాలేదు అని సంతోషపడ్డాడు అని జయదేవుల వర్ణన.

పై చరణాలు అన్నింటిలో మనకు రాధలో 'విచ్చిత్తి', 'లీల', 'విలాసం', 'శోభ', 'దీప్తి', 'కాంతి' మొదలైన సహజమైన సామాన్య అభినయాలు కనిపిస్తాయి. 'మోహం', 'ఔత్సుకం', 'గర్వము' మొదలైనవి సంచారీ భావాలు. రతి స్థాయీ భావము. రసము 'సంభోగ శృంగారం'. నాయికలో ప్రియున్ని తన ప్రేమతో ఆధీనంలో ఉంచుకొని, తన అందాలను పొగిడేలా చేస్తూ, ఆజ్ఞలను శిరసావహించేలా చేసుకున్న 'స్వాధీన పతిక' నాయికా లక్షణాలు మరియు అభిలాష కామావస్థలు కనిపిస్తున్నాయి.

(పై చర్చించిన అంశాలను గురు కేలుచరణ్ మహాపాత్ర, షరాన్ లోవెన్ గార్లు U.S.A లో చేసిన 'కురు యదునందన' లెక్-డెం మరియు ప్రదర్శనల్లో, సోనాల్ మాన్సింగ్, ఇందిరా కదంబి వంటివారి నృత్య రూపకల్పనలు మొదలైనవాటిలో గమనించవచ్చు)

అలా ఒకరినొకరు అలంకరించుకొని హాయిగా ప్రణయ డోలికలూగుతూ రాధా కృష్ణులు యమునా నదీ తీరాల్లోని ఇసుక తిన్నెల్లో కూర్చొని బృందావనాల చీకట్లను వారి శోభతో తొలగించారు. రాధారాణి మెరుపులు చంద్రున్ని సైతం అవమానించేలా ఉంది అని కృష్ణుడు మనసులో భావించిన వెంటనే వెన్నెల అసూయతో రెట్టింపు కాంతిని వెదజల్లిందని జయదేవులు అంటారు.

**<u>ముగింపు</u>**

పైన చర్చించిన అన్ని అష్టపదులలో సందర్భానుసారంగా నాయికా లక్షణాలలో మార్పులను మనం గమనించాము. కొన్నిసార్లు శోకం, మరికొన్ని సందర్భాల్లో క్రోధం, ఇలా పైకి కనబడే భావం ఏదైనా అంతర్లీనంగా రాధామాధవుల మధ్య రతి (శృంగార) భావమే ప్రముఖంగా ఉంది. రాధలో ప్రణయ కలహాలను సమన్వయము

చెయ్యడానికి అష్టపదులలో చెలికత్తె పాత్ర యెంత ముఖ్య భూమిక పోషిస్తుందో మనం గ్రహించాలి. కృష్ణుడు కొన్ని సార్లు అనుకూల నాయకుడిలా కనిపిస్తే, ఇంకొన్ని సార్లు దక్షిణ లేక శఠ నాయకుడిలా సభికులకు కనిపిస్తాడు. కానీ చివరకు రాధ భక్తి – ప్రేమలకు దాసుడై ఆమెను 'స్వాధీనపతిక'ను చేస్తాడు.

రాధ 'ఖండిత' నాయికలా కోపించినా కూడా కృష్ణుడు ఆమెను నొప్పించక సముదాయించడానికి యత్నిస్తాడు. ఆమె 'కలహాంతరిత' నాయికలా కలహించినా, 'ప్రోషిత భర్తృక'లా సందేహించినా, 'విరహోత్కంఠిత' మరియు 'విప్రలబ్ద' నాయికలా విరహించినా, 'వాసకసజ్జిక'లా అలంకరించుకొని ఆకర్షించి, 'అభిసారిక'లా తన వద్దకు చేరినా...... కృష్ణుడికి రాధ పై ఉన్న ప్రేమాభిమానాలలో అణువంత కూడా మార్పులేదు. జయదేవుడు వ్రాసిన ఈ గీత గోవిందం చదివిన భక్త రసికులకు జీవాత్మ భగవంతునుపై తన భావాలను ఏ విధంగా చూపినా సరే, ఆయన కనికరించి అనుగ్రహిస్తాడు అనే తాత్పర్యం సులభంగా బోధ పడుతుంది. ఈ కావ్యం అంతా శృంగారము మరియు భక్తి రస ప్రధానమైనది కనుక భరత ముని నాట్యశాస్త్రంలో చెప్పిన ఈ క్రింది శ్లోకాన్ని ధ్యాసలో ఉంచుకోవడం ముఖ్యం.

'పితా పుత్రస్నుషా స్వశ్రూ దృశ్యం యస్మాత్తు నాటకం|

తస్మాదేతాని సారవాని వర్జనీయాని యత్నతః|| ' (నా.శా. 22 అ. పుట: 682) 28

అనగా పెద్దలు, పిన్నలు, బంధుమిత్రులు అందరూ కలిసి వీక్షించేటప్పుడు వారి మనసుకు, దృష్టికి సంకోచం కలిగించే ఏ క్రియలను రంగ స్థలము పై నర్తకీ నర్తకులు అభినయించరాదు అని దాని భావం. స్త్రీ పురుష చుంబనము, ఆలింగనము, స్థన స్ప్రుశం, నఖక్షతం, దంతక్షతము, జలక్రీడలు మొదలగునవి నాట్యశాస్త్రంలో నిషేధించిన చేష్టలు. ఇలా నాట్యశాస్త్రంలో చెప్పబడిన సూచనలను అనుసరించి నాట్య ప్రదర్శన చేసినచో రససిద్ధి కాగలదు అనడానికి ఈ వ్యాసంలో చర్చించిన నాట్య దిగ్గజుల ప్రదర్శనలే ఉదాహరణలు.

**<u>పాద సూచికలు:</u>**

- 1- నాట్య శాస్త్రం, పుట: 192
- 2- నాట్య శాస్త్రం, పుట: 215
- 3,4,5 – గీత గోవిందం, 6 వ సర్గ, పుట: 147
- 6,7,8,9 - గీత గోవిందం, 4 వ సర్గ, పుట: 141

- 1౦, 11, 12, 14 - గీత గోవిందం, 7 వ సర్గ, పుట: 149
- 13, 15 - గీత గోవిందం, 7 వ సర్గ, పుట: 15౦
- 16, 17, 18 - గీత గోవిందం, 8 వ సర్గ, పుట: 154
- 19, 20, 21 - గీత గోవిందం, 9 వ సర్గ, పుట: 156
- 22, 23 - గీత గోవిందం, 5 వ సర్గ, పుట: 145
- 24, 25, 26, 27 - గీత గోవిందం, 12 వ సర్గ, పుట: 167
- 28 – నాట్యశాస్త్రము, పుట: 682.

**ఉపయుక్త గ్రంథాలు:**


1. శ్రీ రామ అప్పారావు, పోనంగి. (1957). నాట్యశాస్త్రము. నాట్యమాలా పబ్లికేషన్స్.
2. స్టోల్లెర్ మిల్లర్, బార్బరా. (2016). జయదేవాస్ గీత గోవిందం. మోతిలాల్ బనారసి దాస్ పబ్లికేషన్స్.
3. భక్తి వేదాంత నారాయణ గోస్వామి, శ్రిల. (2017). శ్రీ గీత గోవింద. గౌడియ వేదాంత పబ్లికేషన్స్.
4. సాయి కృష్ణ, టి. (2010). శ్రీ గీత గోవింద కావ్యము. ప్రజాహిత పబ్లికేషన్స్.
5. వేణుగోపాల్, డి.(2002). నాట్యశాస్త్ర దర్పణము. హిందీ ప్రచార్ ప్రెస్.
6. ఘోష్, మన్మోహన్. (1951). ది నాట్యశాస్త్ర. ది రాయల్ ఆసియాటిక్ సొసైటీ పబ్లికేషన్స్. బెంగాల్.
7. శ్రీ రామ అప్పారావు, పోనంగి. (1988). నాట్యశాస్త్రము (విశ్లేషణాత్మక అధ్యయనం). నాట్యమాలా పబ్లికేషన్స్.
8. బహదూర్, కె.పి. (1972). ది రసికప్రియ అఫ్ కేశవదాస. మోతిలాల్ బనారసి దాస్ పబ్లికేషన్స్.
9. Dr.రాఘవన్, వి. (1978). శృంగార ప్రకాశ. వేదాంత ప్రెస్. థియొసాఫికల్ సొసైటీ.
10. లోవెన్, షరాన్. (2౦19, జూలై 23). Kuru Yadunandana by Guru kelucharan Mohapatra USA lec-dem introduced by Sharon Lowen in USA. youtube. [https://youtu.be/aQ_7rV_Zu1k?si=3q7f9gS4956Ep9qO]

11. ఒడిస్సీ విలాస్.(2౦2౦, మే 19). Guru Kelucharan Mohapatra : Dhira Samire. youtube. [https://youtu.be/SPJkSz92-SY?si=stqzNj2nf74_u7ky]
12. కృష్ణధ్వని నాట్య. (2023, march 21). Nindati Chandanam- Gayatri Krishnaveni Lakshmanan AbhinayAnubhavam. youtube [https://youtu.be/PKZMCTzJ0bA?si=TQ7K7uAjbYu0CNsE]
13. ఒడిస్సీ విలాస్.(2౦2౦, మే 19). Guru Kelucharan Mohapatra : Pasyati Dishi Dishi. youtube. https://youtu.be/agWrdpECVLY?si=hy28HedCh2NVwn4J
14. ముద్గల్, మాధవి. (2౦2౦, జూలై 19). Madhavi Mudgal-Pashyati Dishi Dishi-Ashtapadi. youtube. https://youtu.be/5GbMuZLytNI?si=T9FNAA2ITdsPzXlq
15. డే, సబర్నిక్.(2౦22, డిసెంబర్ 23). YAMI HEY by Sabarnik De, choreographed by Guru Kelucharan Mohapatra. youtube. https://youtu.be/ZO0COQdKyH4?si=udkSopI9Ytohllk7
16. కైశికి నృత్యభాష. (2౦21, జూలై 26). Asthapadi : Sakhi He. youtube. https://youtu.be/UA1H8sYytWs?si=22qms9aFN-8ndv4D
17. గీతాంజలి- లర్న్ మ్యూజిక్ అండ్ డాన్స్. (2013, డిసెంబర్ 23). Bharatanatyam Legends - Prof. Sudharani Raghupathy - Ashtapadi (Yahi Madhava). youtube. https://youtu.be/N4j36Nee6IQ?si=2aKkdHbvLRJUloMB
18. IGNCA. Interpretation of gita govinda in Indian classical dance forms (vol. i) : Guru Kelucharan Mohapatra, Vidushi Sonal Mansingh and ms. Madhavi Mudgal : Free download, Borrow, and streaming. Internet Archive. (n.d.). https://archive.org/details/dni.ncaa.IGNCA-1745-VHS

19. IGNCA. Interpretation of gita govinda in Indian classical dance forms (vol. ii) : Guru Kelucharan Mohapatra:  : Free download, Borrow, and streaming. Internet Archive. (n.d.). https://archive.org/details/dni.ncaa.IGNCA-1746-VHS